క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివపంచాయతన నవగ్రహ సహిత భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేద పండితులు సువర్ణం పార్థివ శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, ఋుత్విగ్వరణము, పంచగవ్య ప్రాసనం, అఖండ దీపారాధనతో పాటు హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని, సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల బీఎస్పీ నూతన కమిటీని శనివారం బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు భూపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడు రజినీకాంత్, భరత్, మండల కార్యదర్శులుగా రాజశేఖర్, హన్మంతు, రవీందర్, రాంచందర్, మైనార్టీ అధ్యక్షుడిగా పర్వేజ్ అహ్మద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న రాజులనాయుడు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఏడీఏ రాజులనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, రూ.843 చెల్లించి విత్తనాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు చౌదరి తిరుపతి, ఏఈవో లావణ్య, రైతులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉబేద్‌బిన్ యాహియా, అహ్మద్ బిన్ అబ్దుల్లా, సైద్‌బిన్ హుసేన్, సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: ఉగ్రం
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: ఉగ్రం

– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	40
క్యాబేజ	40

–ఆసిఫాబాద్‌అర్బన్

అందని ఈ -పంచాయతీ సేవలు



ఖమాన గ్రామ పంచాయతీ భవనం



బంబార జీపీలో టీ -ఫైబర్ సోలార్ ఇన్వర్టర్ సెటప్

- అందుబాటులోకి రాని టీ -ఫైబర్ ఇంటర్‌నెట్
- పంచాయతీల్లో ప్రారంభం కాని ఆన్‌లైన్ సేవలు
- నిరుపయోగంగా కంప్యూటర్లు

వాంకిడి: గ్రామపంచాయతీల ద్వారా పౌర సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ -పంచాయతీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించాలని, ప్రతీ పనికి మండల కేంద్రానికి వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ -పంచాయతీ విధానానికి శ్రీకారం చుట్టింది. కానీ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం అనుకున్నంత స్థాయిని చేరుకోలేకపోతోంది. ఈ -కార్యాలయాల ద్వారా జనన, మరణ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు, జీపీకి వచ్చే ఆదాయం, ఇంటి నిర్మాణ అనుమతులు, ఇంటి పన్నులు, ఇతర వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు సైతం సులభమవుతుంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రతీ సమాచారాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్ చేసుకునే పరిస్థితి ఉంది.

ప్రతీ పనికి మండల కేంద్రానికి..

గ్రామీణులకు స్థానికంగా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు అందజేసినా ఇంటర్‌నెట్ సౌకర్యం లేక ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఆయా గ్రామస్తులతో పాటు పంచాయతీ కార్యదర్శులకు సైతం తిప్పలు తప్పడం లేదు. కంప్యూటర్లు ఉన్నా ఇంటర్‌నెట్ లేని కారణంగా ప్రతీ దానికి ఆన్‌లైన్ చేసుకునేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్తున్నారు. ఈ -పంచాయతీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, తద్వారా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా పాలనలో పారదర్శకత నెలకొంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

చివరిదశకు పనులు



మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవం. అన్ని గ్రామ పంచాయతీల్లో టీ -ఫైబర్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. కాని ఇంటర్‌నెట్ సేవలు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం మండల కేంద్రం నుంచే ఈ – పంచాయతీ సేవలు అందిస్తున్నాం. టీ -ఫైబర్ ఇంటర్‌నెట్ అందుబాటులోకి వస్తే జీపీ కేంద్రాల్లోనే సేవలు అందుబాటులోకి వస్తాయి.

– శివకుమార్, మండల పంచాయతీ అధికారి

11 జీపీల్లో కంప్యూటర్లు..

మండలంలో ప్రస్తుతం 28 గ్రామపంచాయతీలు ఉండగా 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఈ -పాలనకు సంబంధించి పాత 11 గ్రామ పంచాయతీలకు కంప్యూటర్లు పంపిణీ చేసింది. పాలనలో పారదర్శకత, పనుల్లో వేగం పెంచాలనేది ఈ -పాలన ఉద్దేశం. కాని గతంలో అనేకసార్లు గ్రామ పంచాయతీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నాలు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైప్‌లైన్ విస్తరణ చేపట్టగా తవ్వకాల్లో చాలా చోట్ల కేబుల్ తీగలు తెగిపోయాయి. అనంతరం టీ -ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించేందుకు రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించింది. కానీ ఇప్పటి వరకు మండలంలోని ఏ ఒక్క గ్రామ పంచాయతీలో ఇంటర్‌నెట్ సేవలు ప్రారంభం కాలేదు. ప్రతీ గ్రామపంచాయతీ కేంద్రంలో టీ -ఫైబర్‌కు సంబంధించిన సోలార్ ఇన్వర్టర్‌తో కూడిన సెటప్‌ను ఏర్పాటు చేసి వదిలేశారు. ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో ఏళ్ల నుంచి పంచాయతీల్లోని కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి.

అటెన్షన్ ప్లీజ్.. రాత్రివేళ.. నీటి వృథా



వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో నెల రోజులుగా రాత్రివేళ అందరూ పడుకున్నాక మిషన్ భగీరథ నీటిని వదులుతున్నారు. అధికారులు రాత్రి 10.30, 11.00 గంటల ప్రాంతంలో నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లాలు పాడైపోవడం, ఆన్‌ఆఫ్ ట్యాబ్‌లు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. రాత్రి సమయంలో నీరు విడుదల చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత అధికారి: శైలేందర్, మిషన్ భగీరథ ఏఈ, వాంకిడి
సెల్ నంబర్: 7416288515

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రెబ్బెన: మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కెరమెరి: మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేశ్

రెబ్బెన: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫ్లాగ్‌షిప్‌లో భాగంగా మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, సర్పంచ్ పోషమల్లు, ఏపీవో బుచ్చన్న, ఏపీఎం రాజ్‌కుమార్, ఎంపీవో అంజద్‌పాషా, ఏఈఈ సోనీ, డాక్టర్ సుజిత్, ఏఈ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమీక్ష

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ పెందోర్ మోతీరాం అధ్యక్షతన జరిగిన మండల సమీక్షా సమావేశం సాదాసీదాగా కొనసాగింది. వైద్యాధికారి వెంకటేశ్ మాట్లాడుతూ సబ్‌సెంటర్లలో ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆసిఫాబాద్‌లో స్కానింగ్ సెంటర్ త్వరలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దేవాపూర్‌లో రూ.20 లక్షలతో సబ్‌సెంటర్ భవనం మంజూరైందని, రావుజీగూడలో వంతెన పనులు కొనసాగుతున్నాయని పీఆర్‌ఏఈ స్టీవెన్ తెలిపారు. 11 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయన్నారు. 67 సంఘాల్లో 40 సంఘాల్లో ఓడీఎస్ ఉందని, పెండింగ్‌లో ఉన్నవన్నీ ఇందిరమ్మ బకాయిలేనని ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీవో సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, మిషన్ భగీరథ ఏఈ సంతోష్, ఎంపీడీవో సిబ్బంది సుధాకర్, ప్రసాద్, సర్పంచ్‌లు న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లత, కుమారి, ఈసీ ఐక్యానాయక్ తదితరులు ఉన్నారు.

108 సేవలందక తిప్పలు

- అత్యవసర పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ఆర్థికంగా పెను భారం
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు



చింతలమానెపల్లి: మారుమూల మండలాలకు 108 వైద్యసేవలు అందని ద్రాక్షగా మారాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 108 వాహనాలను మారుమూల మండలాలకు కేటాయించక పోవడంతో అత్యవసర వైద్యం అందక అనారోగ్య పరిస్థితుల్లో మండలవాసులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో బాధితులకు ఆర్థికభారం తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

మండలవాసులు అత్యవసర పరిస్థితిలో వైద్యచికిత్స కోసం కాగజ్‌నగర్‌తోపాటు సిర్పూర్‌లోని సామాజిక ఆసుపత్రికి వెళ్తుంటారు. మండలంలోని గూడెం గ్రామం నుంచి సిర్పూర్ 50కిలోమీటర్లు, కాగజ్‌నగర్ పట్టణం 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం 108 వాహనం సిర్పూర్ మండల కేంద్రం నుంచి సేవలు అందిస్తోంది. చింతలమానెపల్లి మండలానికి 108 వాహనం రావాలంటే సుమారు గంట సమయం పడుతుంది. వైద్యచికిత్స అందాలంటే రెండు గంటల సమయం పడుతుంది.

అందని మెరుగైన వైద్యం..

చింతలమానెపల్లి మండలానికి 108 అంబులెన్స్ మంజూరు కాకపోవడంతో ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రం ఏర్పడిన తరవాత ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం నూతన మండలం చింతలమానెపల్లి ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2005లో 108 సర్వీసు ప్రారంభం కాగా 2007లో కౌటాల మండలానికి 108వాహనం మంజూరైంది. నూతన మండలాలు ఏర్పాటైన తర్వాత చింతలమానెపల్లి మండలానికి 108 వాహనం మంజూరు చేసే దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు నూతనంగా 108 వాహనాలు మంజూరైనట్లు గతంలో ప్రకటించినా ఇప్పటివరకు వాహనాలు మండలానికి రాలేదు. పాముకాటు, విషప్రభావం, గుండెపోటుకు గురైన వారితోపాటు, గర్భిణులు, వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి సిర్పూర్ ఆసుపత్రిలో అందే అత్యవసర వైద్యం అంతంత మాత్రమే. ప్రాణాపాయ పరిస్థితిలో 70 కిలోమీటర్ల దూరంలోని కాగజ్‌నగర్ వెళ్లాల్సిన పరిస్థితి. అంబులెన్స్ రావడానికి సమయం పడుతుండడంతో బాధితులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని సరిహద్దు గ్రామాలు గూడెం, కోయపెల్లి, కేతిని, చిత్తాం, దిందా తదితర గ్రామాల ప్రజలు మహారాష్ట్రలోని వైద్యంపై ఆధారపడుతున్నారు. చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాలకు ఉమ్మడిగా 108 సేవలు అందిస్తుండడంతో 108 సిబ్బందిపై అదనపు భారం పడుతోంది.

108 వాహనం కేటాయించాలి

చింతలమానెపల్లి మండలానికి 108 వాహనం కేటాయించాలి. మండలం పరిధిలోని గ్రామాల ప్రజలు అత్యవసర వైద్యం కోసం ఆటోల్లో వెళ్తున్నారు. 108 వాహనం వచ్చే వరకు ఆలస్యం అవుతోంది. 108 వాహనం మంజూరైతే ఇబ్బందులు తప్పుతాయి.

– సుల్కరి ఉమామహేశ్, బాలాజీఅనుకోడ

ఇబ్బంది పడుతున్నాం

మండలంలోని ప్రజలు 108 వాహనం లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు వైద్యచికిత్స అందక చాలా తిప్పలవుతుంది. 108 వాహనం ఉంటే సకాలంలో వైద్య చికిత్స అందుతుంది. అధికారులు స్పందించాలి.

– కుకుడ్‌కార్ రమేశ్, బాలాజీఅనుకోడ

వనరులను పొదుపుగా వినియోగించాలి



అవగాహన కల్పిస్తున్న ఉజ్వల్ కుమార్ బెహరా

రెబ్బెన: ప్రతీ ఒక్కరు వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా అన్నారు. జూన్ 5న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గోలేటిలోని గ్రంథాయలం వద్ద ఇంధన పొదుపుపై యువకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, జూనియర్ ఫారెస్టు అసిస్టెంట్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్లు అందజేస్తాం'



బీజేపీ జెండా ఎగురవేస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ సహకారంతో ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్లు అందజేస్తామని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి -గడపగడపకు బీజేపీ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నాగంపేట, మోసం, ఆరెగూడ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. సాంబయ్య, అశోక్, శ్రీను, గణపతి, బాపురావు, సుమన్, సాయి, తిరుపతి, చిరంజీవి, విగ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కేసీఆర్

లక్ష రూపాయల రైతు రుణమాఫీ చేస్తానని సీఎం కేసీఆర్ రైతులను మోసం చేశారని హరీశ్‌బాబు ఆరోపించారు. మండలంలోని రాస్పెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌తో పలు విషయాలపై చర్చించారు.

బుద్ధుడి విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో నూతనంగా నిర్మిస్తున్న గౌతమ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు పనులను శనివారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావులు పరిశీలించారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ జూన్ 4న బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. విగ్రహ పనులతో పాటు వంతెన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, లాలాజి, మోయిజ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన అజ్మీరా ఆలునాయక్ కూతురు అజ్మీ వైష్ణవి ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ అజ్మీర పుష్పలత, మాజీ సర్పంచ్ అజ్మీర మహేందర్ నాయక్, నాయకులు తోట మహేష్, బొమ్మెన శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.

దివ్యాంగులకు పింఛన్ మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్

సిర్పూర్(టి): సదరన్ సర్టిఫికెట్లు పొంది, అన్ని అర్హతలు ఉండి పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు పింఛన్ మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ అన్నారు. శనివారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు అందజేశారు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మోసం గ్రామశివారులో శనివారం గుడుంబా తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉన్న 5వేల లీటర్ల బెల్లం పానకం, సామగ్రి లభ్యం కాగా ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడిలో ఏఎస్సై హీరామన్, కానిస్టేబుళ్లు శంకర్, నయీం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మె నోటీసు



వాంకిడి: సమ్మె నోటీసు అందజేస్తున్న డీలర్లు



రెబ్బెనలో..

వాంకిడి: సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ 5 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తహసీల్దార్ రహీముద్దీన్‌కు మండలంలోని రేషన్ డీలర్లు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. రేషన్ డీలర్లకు కనీస వేతనం, రూ.10లక్షల ఇన్సురెన్స్ తదితర న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని నోటీస్‌లో పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రెబ్బెన: రేషన్ డీలర్లకు సంబంధించి దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండలంలోని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. శనివారం డెప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు గౌతం, స్వప్న, కిషన్‌సింగ్, విజయ, రమేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాస్పెల్లిలో పత్తి దగ్ధం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామంలో పెర్క మహేశ్ అనే రైతుకు చెందిన పత్తి శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. పత్తి పంటను ఇంట్లో నిల్వ చేయగా ఒక్కసారిగా పత్తికి మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన గ్రామస్తులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రెండు క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న మహేందర్ రెడ్డి

సిర్పూర్(టి): గ్రామాల్లోని పరిసర ప్రాంతాలను గ్రామస్తులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయించాలని ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. ఈవో కృష్ణమూర్తి, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.